తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

# జిఎస్ఎల్వి ఎఫ్ 17 కౌంట్ డౌన్

## - రేపే ప్రయోగం



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త

సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ శ్రీహరికోట నుంచి శుక్రవారం వేకువ జామున 2 గంటల 55 నిమిషాలకు జిఎస్ఎల్వి ఎఫ్ 17 రాకెట్ ప్రయోగం జరుగునున్నది. ఇందుకు సంబంధించి కౌంట్ డౌన్ బుధవారం రాత్రి 11 గంటల 25 నిమిషాలకు ప్రారంభమైంది. ఈ ప్రయోగం ద్వారా అత్యంత ఆధునిక నితతయారైన భారతదేశ ప్ర ప్రధమభూ పరిశీలన ఈవోఎస్05 ఉపగ్రహాన్ని కక్షలోకి ప్రవేశపెట్టనున్నారు. శ్రీహరికోటలోని రెండవ లాంచ్ పాడ్ నుంచి ఈ ప్రయోగం జరగనున్నది. మూడు దశల్లో ఈ ప్రయోగం ఉంటుంది. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. గత జిఎస్ఎల్వి ప్రయోగాల్లో ఎదురైన సాంకేతిక లోపాలను అధిగమించి ప్రస్తుత ప్రయోగాన్ని విజయవంతం చేసేందుకు ఇస్రోశాస్త్రవేత్తలు శ్రమిస్తున్నారు. ఈఓఎస్ 5 ఉపగ్రహం సబ్ జిఒ సింక్రోనోస్ ట్రాన్స్ఫర్ ఆర్బిట్ లోకి ప్రవేశపెట్టిన అనంతరం అక్కడి నుంచి భూస్థిర కక్షలోకి చేరుకుంటుంది.

## భవిష్యత్ ప్రయోగాలపై ప్రత్యేక దృష్టి : ఇస్రో చైర్మన్



ఇస్రో ఆధ్వర్యంలో ఈ ఏడాదిలో ఏడు ప్రయోగాలను చేపట్టేందుకు ప్రణాళికలను రూపొందించడం జరిగిందని, ఇందులో భాగంగాభవిష్యత్ ప్రయోగాలపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నట్లు ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ వెల్లడించారు. బుధవారం సూళ్లూరుపేటలోని శ్రీ చెంగాళ మాత పరమేశ్వరి దేవిని దర్శించుకున్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిఎస్ఎల్విఎఫ్ 17 ప్రథమ ప్రయోగమని అన్నారు. గత ప్రయోగంలో నెలకొన్న సాంకేతిక లోపాలను అధిగమించి ప్రస్తుతం ఈ ప్రయోగాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. జిఎస్ఎల్వి ఎఫ్ 17 రాకెట్ ద్వారా భారతదేశానికి అత్యంత ఉపయోగకరమైన ఈవోఎస్ 05 ఉపగ్రహాన్ని కక్షలోకి పంపుతున్నట్లు చెప్పారు. ఈ ఉపగ్రహం దేశ రక్షణ వ్యవస్థతో పాటు, వ్యవసాయం, ప్రకృతి వైపరీత్యాలు వంటి అంశాలపై సమగ్రంగా పరిశీలనాత్మకంగా ముందస్తు సమాచారాన్ని అందజేస్తుందని నారాయణన్ చెప్పారు. జిఎస్ఎల్వి ఎఫ్ 17 ప్రయోగానికి సంబంధించి బుధవారం రాత్రి 11 గంటల 25 నిమిషాలకు కౌంట్ డౌన్ ప్రారంభమవుతుందని 27గంటల 30 నిమిషాల కౌంట్ డౌన్ కొనసాగి శుక్రవారం వేకువ జామున రెండు గంటల 55 నిమిషాలకు ప్రయోగం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రయోగ విజయంతోఇస్రో ప్రప్రధమంగా పూర్తిస్థాయిలో భూ పరిశీలన ఉపగ్రహాన్ని రోదసిలోకి పంపడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఎంఎస్ డి గ్రూప్ డిప్యూటీ డైరెక్టర్ గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కంటైనర్ ఢీకొని భార్య మృతి, భర్తకు గాయాలు




పలమనేరు, సెప్టెంబర్ 2. ప్రభాతవార్త:

పలమనేరు మున్సిపాల్టీ పరిధిలోని నాగమంగళం వద్ద బుధవారం ఉదయం ఓ కంటైనర్ ఢీకొన్న సంఘటనలో భార్య అక్కడి కక్కడే మృతి చెందగా భర్త గాయపడ్డాడు. పలమనేరు పట్టణంలోని జిలానీ క్రాస్ కు చెందిన నవాజ్ భాష. అతని భార్య సర్తాజ్ ముళ్ళబాగల్ లో ఓ శుభ కార్యానికి వెళ్ళి మోటార్ సైకిల్ పై తిరిగి వస్తుండగా వెనుక నుండి వస్తున్న కంటైనర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్ పై వెనుక కూర్చున్న సర్తాజ్ కింద పడిపోవడంతో కంటైనర్ ఆమెపై దూసుకు వెళ్ళింది. ఈ ప్రమాదంలో సర్తాజ్ అక్కడికక్కడే మృతిచెందగా నవాజ్ భాష గాయపడ్డాడు. మృతదేహాన్ని శవ పరీక్షకు పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# టిటిడిలో అవినీతి తిమింగళాలెందరో!

### ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాధంపై ఏసిబి సోదాలు - అక్రమార్కులైన ఉద్యోగుల్లో ఉక్కిరిబిక్కిరి



తిరుమల/తిరుపతి, సెప్టెంబర్ 2ప్రభాతవార్తప్రతినిధి:

ధార్మికసంస్థ టిటిడిలో కోట్లకు పడగలెత్తిన అవినీతి తిమింగళాలు లెక్కకు మించి ఉన్నారని, ఏఈఓ స్థాయి నుండి సూపరింటెండెంట్‌లు, డిప్యూటీ ఈఓ వరకు కొందరు అవినీతి పెరిగిపోయిందిన గుప్పుమంటోంది. అవినీతి ఉద్యోగులపై కొరఢా ఝుళిపించాల్సిన అవినీతి నిరోధకశాఖ(ఏసిబి)ఫిర్యాదు లేనిదే ఏమీ చేయలేమని వ్యాఖ్యలు చేయడం విస్మయం కలిగిస్తోంది. టిటిడి చరిత్రలో అవినీతి తిమింగళాలపై ఏసిబి దాడులు చేసిన సందర్భాలు లేవనేది ఇప్పుడు టిటిడి వర్గాల్లో హాట్‌టాఫిక్‌గా మారింది. తాజాగా ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై తిరుమల శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈఓ ఎం.లోకనాథం ఇంటిపై ఏసిబి అధికారులు సోదాలు చేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీనివెనుక రాజకీయ ప్రమేయం ఉందనే ఆరోపణలు వ్యక్తమవుతూన్నా ఏసిబి అధికారులు మాత్రం అందిన ఫిర్యాదు మేరకు సోదాలు చేశామని వెల్లడించారు. బుధవారం ఉదయం లోకనాథం ఇంట్లో ఉన్న సమయంలోనే తిరుపతి పెద్దకాపులేఔట్‌లోని ఆయన నివాసంతో బాటు ఆయన ఇద్దరు బావమరుదులు ఇళ్ళలో, ఏర్పేడు మండలం చెల్లూరులోని ఆయన సోదరుడి ఇంట్లో,తిరుమలలోని డిటైప్‌క్వార్టర్స్‌లోని కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. ఆయన ఆదాయానికి మించి భారీగా ఆస్తులు కూడబెట్టారనే ఫిర్యాదులు రావడంతో ఈ మెరుపు దాడులు చేవామని ఏసిబి వర్గాల వాదన. ఉదయం నుండి రాత్రి వరకు ఆయన ఇంటినుండి స్వాధీనం చేసుకున్న ఆస్తులకు సంబంధించిన అధికారిక ప్రకటన మేరకు అనేది ఏసిబి అధికారుల నుండి వెల్లడికాలేదు. ఆదాయానికి మించి ఆస్తుల కేసులో ఈ తనిఖీలు కొనసాగుతున్నాయని ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ పరిణామం టిటిడి వర్గాల్లో కలకలం రేపింది. డిఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 5మంది సిఐలు, ఇద్దరు ఎస్ఐలు, 20మంది వరకు సిబ్బంది రంగంలోకి దిగి సోదాలు ప్రారంభించాయి. తొలుత ఆయన ఇంట్లోని ముఖ్యమైన పత్రాలు, బ్యాంక్ లాకర్లు, ఆస్తుల పత్రాలు, నగదు, బంగారానికి సంబంధించిన వివరాలను అధికారులు సేకరించారు. తిరుమలలో ఉన్న డిప్యూటీ ఈఓ అధికారిక కార్యాలయంలో కూడా ఏసీబీ బృందాలు సోదాలు నిర్వహించారు. రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. సుదీర్ఘ కాలంగా టిటిడిలో కీలక బాధ్యతల్లో ఉన్న లోకనాథంపై పెద్ద ఎత్తున అక్రమాస్తుల ఫిర్యాదులు రావడంతోనే ఈ దాడులు ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తనిఖీలు ఇంకా కొనసాగుతున్నాయి. సోదాలు పూర్తయిన తర్వాత ఎంత మొత్తం ఆస్తులు, పత్రాలు స్వాధీనం చేసుకున్నారనే విషయాన్ని అధికారులు అధికారికంగా వెల్లడించే అవకాశం ఉంది. ఆదాయంతో పోలిస్తే ఆస్తుల విలువ ఎంత ఉందనే అంశంపై ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

# స్వర్ణముఖిలో...యథేచ్ఛగా ఇసుక దోపిడీ



అర్ధనారీశ్వర ఆలయం పక్కనే మట్టిని లారీలతో తరలిస్తున్న దృశ్యం

తొట్టంబేడు, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:

ఒక నాడు శ్రీకాళహస్తీశ్వరాలయం సమీపంలోని రాజగోపురం నిర్మాణ సమయంలో కూలీలు పగలంతా కష్టపడి సాయంత్రం జీవనది స్వర్ణముఖిలో మునిగితే ఆ రోజు కష్టపడినంత బంగారు దొరికేదని చెబుతారు.అలాంటి పవిత్ర నదిలో నేడు అక్రమార్కుల దందా పెచ్చుపెరిగిపోతుంది.బంగారు తల్లికి చంద్రగిరి నుంచి నాయుడుపేట వరకు నదిలో ఇసుకను తవ్వుకుంటూ గర్భశోకాన్ని మిగుల్చుతున్నారు. యధేచ్ఛగా నదిని దోచుకుంటూ పబ్బం గడుపుకుంటూ జేబులు నింపుకుంటున్నారు. ఈ దోపిడిని గురించి పట్టించుకునే నాధుడు కరువయ్యాడు.ఈ దోపిడితో భూగర్భ జలాలు అడుగింటిపోతున్నాయి. అంతేకాక జీవనది జీవచ్ఛవంలా మారుతుంది.

**తొట్టంబేడు మండలంలో యథేచ్ఛగా దోపిడి:**

శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండల పరిధిలో స్వర్ణముఖి నదిలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. శ్రీ అర్ధనారీశ్వర స్వామి ఆలయం ప్రక్కన ఉన్న స్వర్ణముఖి నదిలో ప్రొక్లిన్‌ల సహాయంతో టిప్పర్లతో విచ్చలవిడిగా మట్టిని తరలిస్తున్నారు. అధికారిక పనుల కోసం మట్టి తరలిస్తున్నట్లు చెబుతూ నదిలో ఎక్కడపడితే అక్కడ తవ్వకాలు జరుపుతున్నారు. దీంతో నది గర్భంలో భారీ గుంతలు ఏర్పడి నది స్వరూపమే మారిపోతోంది. పగలు రాత్రి తేడా లేకుండా టిప్పర్లు తిరుగుతూ మట్టిని తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారిక అవసరాల పేరుతో తవ్వుతున్న మట్టిని బయట ప్రైవేటు వ్యక్తులకు, లేఅవుట్లు, భవన నిర్మాణాలకు అధిక ధరలకు అమ్ముకుంటున్నట్లు సమాచారం. ఇదంతా రెవెన్యూ, మైనింగ్ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోందని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నదిలో ఇలా లోతుగా తవ్వడం వల్ల భూగర్భ జలాలు అడుగంటుతాయని, పరిసర పంట పొలాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన చెందుతున్నారు. ప్రొక్లిన్ సహాయంతో టిప్పర్లతో తవ్వుతున్న బంకమట్టిని అధికారిక పనుల పేరుతో ఇటుక వ్యాపారాలు చేసే వారికి అధిక ధరలకు తరలిస్తూ పబ్బం గడుపుకుంటున్నారని స్థానికంగా గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే ఈ తవ్వకాల వెనుక ఓ రాజకీయ నాయకుడి అనుచరుడు ఉన్నాడని, అందుకే ఎవరూ అడ్డుకోవడం లేదని స్థానికులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఈ విషయంపై తొట్టంబేడు ఎంఆర్ఓ భారతిని వివరణ కోరగా ఆమె వెంటనే స్పందించారు. సమాచారం అందిన వెంటనే తాను స్వయంగా సంఘటనా స్థలానికి చేరుకుని తవ్వకాలను నిలిపివేయించినట్లు తెలిపారు. మట్టి తరలింపునకు మీ వద్ద ఏదైనా అధికారిక అనుమతి ఉంటే కాగితాలు తీసుకుని రావాలని, పత్రాలు పరిశీలించిన తర్వాతే అనుమతి ఇస్తామని వారికి స్పష్టం చేసినట్లు ఎంఆర్ఓ భారతి తెలిపారు. దీంతో అక్కడ తవ్వకాల పనులను నిలిపివేశారు. అయితే ఇలాంటి అక్రమ తవ్వకాలపై శాశ్వత నిఘా ఉంచి, రాజకీయ అండదండలతో నడుస్తున్న బంకమట్టి మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు.గ

## పెళ్లి చేసుకుని మోసం చేశాడని

# భర్త ఇంటి ముందు రెండో భార్య ధర్నా

### ఇంట్లో వస్తే చంపేస్తానంటూ భర్త కత్తితో బెదిరింపు !!

### - పోలీసులను ఆశ్రయించిన వైనం.. కేసు నమోదు !!





భర్త ఇంటిముందు ధర్నా చేస్తున్న రెండోభార్య జీవిత, కుటుంబీకులు, పెళ్లినాటి పోటో

కుప్పం, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త

కుప్పంలో ఫోటోగ్రాఫర్‌గా పనిచేస్తూ తనను రెండో పెళ్లి చేసుకుని ఓ యువకుడు మోసం చేశాడని అతని రెండో భార్య తన తల్లి, బంధువులతో కలసి భర్త ఇంటి ముందర ధర్నాకు దిగింది. ఈ సమయంలో మాటమాట పెరగడంతో భర్త ఇంట్లో వస్తే చంపేస్తానంటూ మచ్చుకత్తితో బెదిరించాడని తనకు న్యాయం చేయాల ంటూ రెండో భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈసంఘటనకు సంబంధించి పోలీసులు, రెండో భార్య జీవిత తెలిపిన మేరకు వివరాలిలా.. చిత్తూరు జిల్లా రామకుప్పం మండల ంకు చెందిన హరీష్, మంజుల దంపతులు కొన్నేళ్ల క్రితం కుప్పంలోని డికెపల్లికి వచ్చి స్థిరపడ్డారు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె జీవిత సంతాన ం. కాగా కుప్పం మండలం నడిమూరుకు చెందిన దామోదర్ అనే యువకుడు కుప్పంలో ఫోటోగ్రాఫర్‌గా పనిచేసేవాడన్నారు. జీవిత తల్లి మంజుల, ఆమె అవ్వ వద్దకు ఫైనాన్స్ చీటీల విషయంగా దామోదర్ ఇంటికి వచ్చేవాడన్నారు. ఈ నేపథ్యంలో దామోదర్ తాను జీవితను పెళ్లి చేసుకుంటానని జీవిత తల్లి, కుటుంబీకులతో చెప్పగా తమ పాపను ఇంకా చదివించాలని పేర్కొన్నారని అయితే పెళ్లి చేయాలని పట్టుబట్టడంతో ఈ ఏడాది ఏప్రిల్ నెలలో దామోదర్ జీవితను కదిరిలోని శ్రీ నరసింహస్వామి ఆలయంలో పెళ్లి చేసుకునా ్నడన్నారు. అప్పటినుంచి మూడు నెలల పాటు తమ ఇంట్లోనే ఉన్న దామోదర్ ఈ మూడు నెలల కాలంలోనే ఇంటిని కొనుగోలు చేయాలని తమ వద్ద నుంచి సుమారు 30లక్షలు తీసుకున్నట్లు జీవిత తల్లి తెలిపింది. ఈ సొమ్ముతో కుప్పంలోని ప్యాలస్ రోడ్డులో ఇల్లు కొన్న దామోదర్ తన కుటుంబీకులతో కలసి ఆ ఇంటికి చేరాడన్నారు. తమ కుమార్తెను పట్టించుకోలేదన్నారు. చివరకు ఆరా తీస్తే దామోదర్‌కు ఇదివరకే పెళ్లయి పిల్లలు సైతం ఉన్నారని తెలిపింది. ఈ విషయంగా తాము దామోదర్ ఇంటి ఎదుట ధర్నాకు దిగామన్నారు. అయితే దామోదర్ తమను ఇంట్లో ప్రవేశిస్తే చంపేస్తానని కత్తితో బెదిరించాడని జీవిత, ఆమె తల్లి పేర్కొన్నారు. ఈ విషయంగా తనకు న్యాయం చేయాలని జీవిత కుప్పం పోలీసులను ఆ శ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అర్బన్ ఎస్సై బాబు తెలిపారు.

## వరుణదేవుడి ఆవాహనం కోసం

# వరుణయాగం పూర్ణాహుతి



తిరుమల, సెప్టెంబర్ 2ప్రభాతవార్తప్రతినిధి:

ఐదు రోజులుగా నిర్వహిస్తున్న కారీరిష్టి యాగం నేడు మహాపూర్ణాహుతితో ముగియనుంది. సకాలంలో వర్షాలు కురిసి భూమి సస్యశ్యామలంగా మారాలని ప్రజలందరికీ సుఖసంతోషాలు కలగాలని సంకల్పిస్తూ ఈ యాగాన్ని చేపట్టారు.

## గణనాధుడిని దర్శించుకున్న

# 20 సూత్రాల కమిటీ చైర్మన్



కాణిపాకం, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 20 సూత్రాల కమిటీ చైర్మన్ లంకా దినకరన్ బుధవారం కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ సూపరిటెండెంట్ వాసు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజు గోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామి వారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు వేద మండపంలో ఆశీర్వచనం చేసి స్వామి వారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

## తల్లి, కుమారుడు అదృశ్యం

తిరుపతి క్రైమ్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త



తిరుపతిలో తన అక్క ఇంట్లో నివాసం ఉన్నటువంటి చెల్లెలు మరియు తన కుమారుడు అదృశ్యం ఆయన సంఘటన ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొర్లగుంట మారుతి నగర్‌లో చోటుచేసుకుంది. ఈస్ట్ ఎస్ఐ స్వాతి సమాచారం మేరకు సత్య సాయి జిల్లా లేపాక్షి మండలం, కల్లూరు గ్రామంలో నివాసముం టున్న భార్యాభర్తలు మేఘన, శివ కేశవులు గత 6 సంవత్సరాల క్రితం ప్రేమించి వివాహం చేసుకున్నారు. వీరికి ఐదు సంవత్సరాల కౌశిక్ సాయి అనే బాబు కలడు. సాఫీగా సాగుతున్న వీరి కుటుంబంలో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో రెండు సంవత్సరాల క్రితం విడిపోయారు. తల్లి కుమారుడు తిరుపతిలోని కొర్లగుంటలో తల్లికి అక్క ఆయిన శ్రీలేఖ ఇంట్లో ఆశ్రయం కల్పించడంతో ప్రైవేట్ పాఠశాలలో ఆయాగా విధులు నిర్వహిస్తూ తన కుమారుడిని పోషించ సాగింది. ఇదిలా ఉండగా తల్లి మేఘన రాత్రి వేళల్లో వాట్సాప్‌లో చాటింగ్ చేయడం చూసి అక్క నిలదీసింది. తన వ్యక్తిగత విషయాల్లో జోక్యం చేసుకోవడంతో తన కుమారుడితో కలిసి ఇంటి నుండి ఆగస్టు 22వ తారీఖు అదృశ్యమైంది. తిరుపతి పరిసరాలు ప్రాంతాలు వెతికిన అక్కకు ఎక్కడ వాళ్ల చెల్లి జాడ కనిపించకపోవడంతో తల్లి కుమారులు అదృశ్యమైనట్టు ఈస్ట్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అక్క ఫిర్యాదు మేరకు ఎస్ఐ స్వాతి కేసు నమోదు చేస్తే దర్యాప్తు చేపట్టారు.

## నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

పుత్తూరు, సెప్టెంబరు 2 ప్రభాతవార్త :

పుత్తూరు రూరల్ మండల పరిధిలోని పరమేశ్వరమంగళం కెకెసి నర్సింగ్ కాలేజీలో నర్సింగ్ కోర్సు చదువుతున్న ఒక విద్యార్థిని బుధవారం ఆత్మహత్యా ప్రయత్నం చేసింది. తమిళనాడులోని పళ్లిపట్టు తాలూకాకు చెందిన యువతి నర్సింగ్ స్కూల్లో ప్రథమ సంవత్సరం చదువుతోంది. బుధవారం విడుదలైన ఫలితాల్లో ఒక సబ్జెక్ట్ ఫెయిలవడంతో మనస్తాపం చెందిన విద్యార్థిని సాయంత్రం ఆరు గంటల సమయంలో బాత్రూమ్‌లోకి వెళ్లి స్పిరిట్ తాగి ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే కాలేజీ యాజమాన్యం స్థానిక అన్నా గౌరి ఆస్పత్రిలో చేర్చి వైద్యం అందించడంతో ప్రాణాపాయం తప్పింది. పోలీసులు విచారిస్తున్నారు.

# ఎస్వీయూలో ఘనంగా 72వ వ్యవస్థాపక దినోత్సవం

### 73 కోర్సులతో ప్రగతిపథంలో.. సాంకేతిక విద్యకు పెద్దపీట

తిరుపతి విద్య, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త



శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం 72వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని మహనీయుల విగ్రహాలకు ఉపకులపతి ఆచార్య టాటా నరసింగరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎం. భూపతి నాయుడు, బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సాయంత్రం శ్రీనివాస ఆడిటోరియంలో వ్యవస్థాపక దినోత్సవ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య టాటా నరసింగరావు మాట్లాడుతూ ఎస్వీయూ ప్రస్తుతం 73 కోర్సులతో విద్యా విస్తరణలో ముందుకెళ్తోందన్నారు. విశ్వవిద్యాలయాన్ని ఏ లక్ష్యంతో స్థాపించారో ఆ ఆశయాలకు అనుగుణంగా విద్య, పరిశోధన రంగాల్లో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా రాయలసీమ ప్రాంత విద్యార్థుల విద్యావసరాలను తీర్చడంలో విశ్వవిద్యాలయం కీలక పాత్ర పోషించిందని తెలిపారు. ఇక్కడ చదువుకున్న అనేక మంది మేధావులు, విద్యావేత్తలు ప్రపంచవ్యాప్తంగా విశ్వవిద్యాలయ ప్రతిష్ఠను పెంచారని పేర్కొన్నారు.సాంకేతిక విజ్ఞానం వేగంగా మారుతున్న నేపథ్యంలో క్వాంటం సాంకేతిక విజ్ఞానం వంటి నూతన రంగాల్లో కోర్సుల రూపకల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పాలనలో వేగం పెంచడంతో పాటు విద్యా విధానంలోనూ కొత్త మార్పులకు శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ సూచిస్తున్న మార్పుల దిశగా విశ్వవిద్యాలయం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఉద్యోగులు నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేసి కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని ఉపకులపతి సూచించారు. భారతదేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల సరసన ఎస్వీయూను నిలబెట్టేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. క్షణికావేశంతో తీసుకునే తప్పుడు నిర్ణయాలు, అవినీతి చర్యలు భవిష్యత్తులో తీవ్ర పరిణామాలకు దారితీస్తాయని హెచ్చరించారు. ఇటీవల ఒకేసారి ఆరు స్నాతకోత్సవాలు నిర్వహించి ఉద్యోగులు సమర్థత చాటారని అభినందించారు.రిజిస్ట్రార్ ఆచార్య ఎం. భూపతి నాయుడు మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలోని నీటి సరఫరా, డ్రైనేజీ సమస్యలతో పాటు ఎన్ఎంఆర్ ఉద్యోగుల వేతనాల పెంపు, పరీక్షల నిర్వహణ, ఫలితాలను సకాలంలో విడుదల చేయడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. విశ్వవిద్యాలయాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను చెల్లించే చర్యలు తీసుకుంటామని తెలిపారు.వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను ఎస్వీయూ నాన్ టీచింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు గుర్రంకొండ శ్రీధర్, కార్యదర్శి సుబ్రహ్మణ్యం (సుబ్బు), సంయుక్త కార్యదర్శి ముత్తువేలు, ఉపాధ్యక్షుడు కోటంగారి మురళి,మనోజ్ సింగ్ ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

